

జై తెలంగాణ అని నినదిస్తున్న ఎమ్మెల్సీ కవిత

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు స్వాగతం

పెద్దపల్లి, మే30: ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం మంచిర్యాలకు వెళ్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు జిల్లా కేంద్రంలోని అయ్యప్ప దేవాలయం వద్ద బీఆర్ఎస్, జాగృతి శ్రేణులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి కవిత పూల మాల వేశారు. జై తెలంగాణ... కాంగ్రెస్ తల్లి వద్దు... తెలంగాణ తల్లి ముద్దు అని నినాదించారు. కార్యక్రమంలో బండారి శ్రీనివాస్ గౌడ్, దాసరి ఉష, ఉప్పు రాజ్‌కుమార్, పూదరి మహేందర్, లైసెట్టి భిక్షపతి, పెంచాల శ్రీధర్, రవీందర్ పాల్గొన్నారు.

**పెద్దకల్వలలో ...**

పెద్దపల్లి రూరల్, మే 30: మండలం పెద్దకల్వల వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు సలేంద్ర కొమురయ్య యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు నాయకులకు ఎమ్మెల్సీ కవిత పేరుపేరున పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలేంద్ర రాములు యాదవ్, నర్ల పోల్ రాజు యాదవ్, నర్ల అంజయ్య యాదవ్, కల్వల రవి, పెగడ శ్రీనివాస్ యాదవ్, సిహెచ్ హన్మాం డ్లు, కారెంగుల అజయ్, కల్వల రవికుమార్, గందం శంకర్, పర్శ శంకర్ యాదవ్, కల్వల శంకర్ పాల్గొన్నారు.

**గోదావరిఖనిలో..**

గోదావరిఖని, మే 30: మంచిర్యాలకు వెళ్తున్న ఎమ్మెల్సీ కవితకు గోదావరిఖనిలో జాగృతి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ జాగృతి నాయకులు పెంట రాజేశ్, తదితరులు ఉన్నారు.

## సింగరేణిలో 1 నుంచి వనమహోత్సవం

గోదావరిఖని, మే 30: వర్షాకాలం ప్రారంభ నేపథ్యంలో జూన్ 1 నుంచి సింగరేణి వ్యాప్తంగా పెద్ద ఎత్తున వన మహోత్సవం కార్యక్రమాలు చేపట్టాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ఆదేశించారు. శుక్రవారం సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంస్థ డైరెక్టర్లు, ఏరియాల జీఎంలు, అటవీ పర్యావరణ శాఖలతో కలిసి సీఎండీ సమీక్ష నిర్వహించారు. మొత్తం 675 హెక్టార్లలో 40లక్షల మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఏరియాలో ఉత్సాహంగా నిర్వహించాలని, కార్యక్రమంలో స్థానికులు, కార్మికులు పాల్గొనేలా చూడాలని సూచించారు. భూగర్భ జలాల పెంపునకు సింగరేణి చేపట్టిన నీటి బిందువు–జల బిందువుపై సీఎండీ సమీక్ష చేశారు. ఇప్పటికి 48 నూతన చెరువుల నిర్మాణం పూర్తయిందని, 25కి పైగా చెరువుల్లో పూడికతీత, మరో వారంలో మిగిలిన చెరువులను పూర్తి చేయాలన్నారు. త్వరలో 106 చెరువులను స్వయంగా పరిశీలించనున్నట్లు సీఎండీ పేర్కొన్నారు. ఇక్కడ సంస్థ డైరెక్టర్లు ఎల్వి సూర్యనారాయణ, కే వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్డీఎం సుభాని, సింగరేణి అటవీ శాఖ సలహాదారులు మోహన్, పరిగేన్, జీఎం సీపీపీ మనోహర్, సైదులు, ఇతర విభాగాల అధికారులు ఉన్నారు.

## పారదర్శకంగా భూ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- 3 నుంచి మండలాల్లో రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మే30: అవినీతికి ఆస్కారం లేకుండా భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ)దాసరి వేణుతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎలిగేడు మండలాన్ని ఎంపిక చేసి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి, భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు. భూ భారతి చట్టం ప్రకారం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎలిగేడు మండలంలో అధికంగా సేత్వార్‌లో సమస్య ఉందని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. వచ్చే నెల 3 నుంచి జిల్లాలోని మిగిలిన మండలాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, సదస్సులు ముగిసే నాటికి సేత్వార్ సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సాదా బైనామాకు సంబంధించి 2020లో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను ఒక వేళ తిరస్కరిస్తే తప్పనిసరిగా కారణాలు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అధికారులు ఎవరైన అక్రమాలు, అవినీతికి పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. తహసీల్దార్ వద్ద పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డు దరఖాస్తులను అర్హత మేరకు పరిష్కరించి లబ్ధిదారులకు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు బీ గంగయ్య, కే సురేశ్, సర్వే ల్యాండ్ రికార్డ్ సహాయ సంచాలకుడు శ్రీనివాసులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



జూలపల్లి : మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

## నిబంధనల ప్రకారం ఇండ్లు కట్టుకోవాలి

ఎలిగేడు,మే 30 : అర్హులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు సూచించారు. మండలంలోని లాలపల్లి, ఎలిగేడు, ర్యాకల్‌దేవ్‌పల్లి, రాములపల్లిలో శుక్రవారం సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ముగ్గులు పోసి ఇండ్ల పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో, ఈఈ హౌసింగ్ అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే భూమి పూజ**

జూలపల్లి, మే 30 : నాగులపల్లి, చీమలపేట, తేలుకుంటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు భూమి పూజ చేశారు. పలువురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. గ్రామాల్లో రూ. 95 లక్షల నిధులతో సామాజిక భవనాలు. మురుగు నీటి కాల్వలు, అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇక్కడ ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, ఏఎంసీ చైర్మన్ గండు సంజీవ్, ఎంపీవో అనిల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు దారబోయిన నరసింహంయాదవ్, నాయకులు కొమ్మ పోశాలు, కందుకూరి అంజయ్య, అడువాల తిరుపతి పాల్గొన్నారు.

## వివాహ వేడుకలకు హాజరు

ముత్తారం, మే 30: మండలంలోని లక్కారం గ్రామంలో బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుర్రాల రవి కూతురు సరస్వతి, సంతోష్ వివాహానికి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇక్కడ ముత్తారం మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, లక్కారం బీఆర్ ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు మదాసి రమేష్ , మాజీ ఉప సర్పంచ్ బర్ల రాయగట్టు, బీఆర్ ఎస్ నాయకులు చిలువెరీ నరేష్, రాజబాపు, దొరి సంపత్, గుర్రాల రాజయ్య పాల్గొన్నారు.

## ఖాళీ స్థలాలు కబ్జాపై ఫిర్యాదు

కోల్‌సిటీ, మే 30: రామగుండం నగర పాలక సంస్థ పరిధి మల్కాపూర్‌లో సర్వే నంబర్ 56, 57లో రూ.కోట్ల విలువైన ఖాళీ భూములను కబ్జా చేస్తున్న వ్యవహారంపై ఈనెల 15న నమస్తే తెలంగాణ దిన పత్రికలో 'ఖాళీ స్థలాలు కబ్జా..' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో శుక్రవారం ఐదో డివిజన్ మాజీ కౌన్సిలర్ మామిడాల చంద్రయ్య నగర పాలక సంస్థ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ జే అరుణ శ్రీకి ఫిర్యాదు చేశారు. అత్యంత విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందిం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వివరించారు. ఆ భూములను భూమిలేని నిరుపేదలకు కేటాయిస్తే బాగుంటుందన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్పందించి రామగుండం రెవెన్యూ అధికారులతో మరోసారి సమగ్ర విచారణ జరిపించి తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వేసవి కార్యాచరణ ప్రణాళిక విజయవంతం

పెద్దపల్లి, మే30: పెద్దపల్లి సర్కిల్ పరిధిలో వేసవి కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామని ఎస్ఈ కంకటి మాధవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది నవంబర్ నుంచి వేసవి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకొని, అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించామన్నారు. లోడ్ పెరిగే అవకాశం ఉన్నచోట్ల కొత్తగా 140 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 34 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని, 17 వీసీబీలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. 22 కిలోమీటర్ల మేర 8 సబ్ స్టేషన్లకు ఇంటర్ లింకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశామని వివరించారు. వోల్టేజ్ హెచ్చు తగ్గులు లేకుండా లైన్లలో కెపాసిటర్ బ్యాంకులు పెట్టామన్నారు. ముందస్తు ఏర్పాట్లు, ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పని చేయటం వల్ల వేసవిలో ఎటువంటి అంతరాయాలు లేకుండా మెరుగైన విద్యుత్ విద్యుత్ సరఫరా చేశామని వెల్లడించారు.

## పొగాకు నియంత్రణ మనందరి బాధ్యత

- జిల్లా అదనపు జడ్జి డాక్టర్ టీ శ్రీనివాసరావు



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా అదనపు జడ్జి డాక్టర్ శ్రీనివాసరావు

పెద్దపల్లి కమాన్, మే 30 : పొగాకు వాడకంతో ప్రజల జీవితాలు అర్థాంతరంగా నాశనమవుతున్నాయని, వాటి ఉత్పత్తులు, వాడకాన్ని నియంత్రించేందుకు మనందరం బాధ్యతగా తీసుకోవాలని జిల్లా అదనపు జడ్జి డాక్టర్ టీ శ్రీనివాస రావు అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో శుక్రవారం కోర్టు అధికారులు, సిబ్బందితో పొగాకు నిర్మూలనపై అదనపు జడ్జి ప్రతిజ్ఞ చేయించారు. పొగాకు వాడకంతో లాభాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయని, దీని వల్ల ప్రజలు నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్ల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకుతో కలిగే దుష్ఫలితాలను ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇక్కడ జూనియర్ సివిల్ జడ్జి మంజుల, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రఫీయుద్దీన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ
CLASSIFIED
BUSINESS OFFER



★ మీ ఇంటి వద్ద ఉండే రోజుకు 2 గంIIల చేతివ్రాత ద్వారా నెలకు 10 వేల నుండి 15 వేల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. Ph: 63044 84084.
NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189


## పౌర హక్కులకు భంగం కలిగించవద్దు

ఎలిగేడు,మే 30 : ఎవరి హక్కులకు భంగం కలిగించవద్దని తహసీల్దార్ యాకన్న అన్నారు. సుల్తాన్‌పూర్‌లో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. పౌరహక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కలవివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలని, అన్ని కులాలు, వర్గాలవారు సోదరభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాక న్న, నరేంద్రచారి, ఎంఈఓ అంజయ్య, ఎస్సీవెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, గిర్దావర్ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, పోలీ సు సిబ్బంది, అంగన్వాడీ టీచర్, అంబేడ్కర్ సొసైటీ అధ్యక్షుడు గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఏర్పాటు చేయాలి

గోదావరిఖని, మే 30: సింగరేణి యాజమాన్యం హైదారాబాద్‌లో ఏర్పాటు చెయ్యనున్న సింగరేణి సూపర్ స్పెషాలిటీ దవాఖానను త్వరగా ఏర్పాటు చేయాలని సింగరేణి రిటైర్డు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండం రాజు రాంచందర్‌రావు, ప్రధానకార్యదర్శి భూపెల్లి బానయ్య, ఉప ప్రధానకార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్‌లు పేర్కొన్నారు. సంస్థ గుర్తింపు సంఘం, ఇతర కార్మిక సంఘాలు నిరంతర కృషితోనే సింగరేణి సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఏర్పాటు నిర్ణయం జరిగిందన్నారు. త్వరగా దవాఖాన ఏర్పాటుకు తెలంగాణ సీఎంకు విన్నపించుటకు సింగరేణి సీఎండీకి శుక్రవారం వినతిపత్రంను అందజేశామన్నారు. ఇక్కడ నాయకులు విజయబాబు, నర్సింగరావు, బంగారు రాజయ్య, ఉమాకర్, కనకయ్య, బీరయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

### మ్యాన్‌రైడింగ్ సర్వేపై ప్రశంసాపత్రాలు అందజేత

గోదావరిఖని, మే 30: జీడీకె 11ఇంక్లైన్‌లో 4సీమ్ నుంచి 3సిమ్ వరకు కొత్త మ్యాన్‌రైడింగ్ చైన్‌లిఫ్ట్ విధానం ఏర్పాటుకు సర్వే చేసిన అధికారులకు గని మేనేజర్ మల్లేశం, డివైఎస్ఎస్ఓవై హనుమండ్లు శుక్రవారం ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో సర్వేయర్ గణేశ్, చైన్‌మెన్‌లు వెంకటరెడ్డి, కనకయ్య, సర్వే మజ్దూర్‌లు గజేందర్, రాజమౌళి ఉన్నారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ అధికారి మల్లేశం, సర్వే అధికారి దామోదర్, పాల్గొన్నారు.

### ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

యైటింక్లయిన్‌కాలనీ, మే 30 : ఐక్య పోరాటాలతోనే గని కార్మికుల హక్కులు సాధ్యమని సీఐటీయూ ఆర్జీ–2 కార్య దర్శి ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం సంఘం 55వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా యూనియన్ కార్యాలయంలో జెండా ఎగుర వేసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పని చేస్తున్న కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం సంఘం ఆవిర్భావించిందని గుర్తు చేశారు. నాటి నుంచి కార్మిక వర్గ చట్టపరమైన హక్కులు వాటి పరిరక్షణ లక్ష్యంగా యూనియన్ పని చేస్తూ ముందుకు సాగుతుందని తెలిపారు. నేడు కార్మికులు అనుభవిస్తున్న అనేక హక్కుల సాధనలో సీఐటీయూ పాత్ర ఘనీయమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, వెంక న్న, సంపత్, రాంప్రసాద్, నర్సింహ, భూమయ్య, సారంగం పాల్గొన్నారు.

## ట్రాలీ, బైక్ ఢీ: ఒకరి మృతి

కాల్వశ్రీరాంపూర్, మే30: గంగారం గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం ట్రాలీ, బైక్ ఢీకొన్న సంఘటనలో కూనారం గ్రామానికి చెందిన ఎండీ అక్రమ్(26) అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూనారం గ్రామానికి చెందిన అక్రమ్ కాల్వశ్రీరాంపూర్‌లో ఆటో మెకానిక్ గా పని చేస్తున్నాడు. పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా గంగారం గ్రామ శివారు ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాలీ బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో అక్రమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సమీరా బేగం, తల్లిదండ్రులు అక్బర్–రేష్మబేగం ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొడుకును చూసి తల్లిదండ్రులు విలపించిన తీరు పలువురిని కలిచి వేసింది. సంఘటనా స్థలానికి ఎస్ఐ వెంకటేశ్ చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహా న్ని పోస్టుమార్టం కోసం సుల్తానాబాద్ దవాఖానకు తరలించారు. ట్రాలీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

పెద్దపల్లి, మే30: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ ఐటీఐ మైదానం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## రక్తదాతలకు అవార్డులు

పెద్దపల్లి, మే30: జిల్లాలో సేవాభావంతో అత్య ధిక సార్లు రక్త దానం చేసిన వారికి రాష్ట్ర గవర్నర్ ప్రత్యేకంగా అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి చైర్మన్ కావేటి రాజగోపాల్ శుక్రవారం తెలిపారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారు ఈనెల 31లోగా మొబైల్ నంబర్లు 98498 90646, 98662 20236, 91778 86946 లలో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని రక్తదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## చట్టబద్ధ హక్కులు కల్పించాలి




నిరసన తెలుపుతున్న కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ మే 30 : సింగరేణి సంస్థలో సులభ్ కాంప్లెక్స్‌లో పని చేస్తున్న కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకన్న యాజమాన్యాన్ని కోరారు. శుక్రవారం సులభ్ కాంప్లెక్స్‌లో పని చేస్తున్న కార్మికులతో ఆర్జీ–2 కార్యాలయం ముందు నిరసన తెలిపి ఏరియా పర్సనల్ డీజీఎం అనిల్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. సంస్థ కార్మికులకు చట్టపరమైన వేతనాలు చెల్లించకపోగా కనీస మౌలిక వసతులు కల్పించడం లేదని గుర్తు చేశారు. దీనిపై యాజమాన్యం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాక్షుడు బీ. అశోక్, బుచ్చమ్మ, స్వరూప, మల్లయ్య, మల్లేష్, సరోజన, రాజేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పంటల సాగు పై రైతులకు అవగాహన సదస్సులు

కమాన్‌పూర్, మే 30: మండలంలోని గుండారం, నాగారం, సిద్దిపల్లె గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ శాఖ , కేవీకే రామగిరి ఖిల్లా ఆధ్వర్యంలో వికాసిత్ కృషి సంకల్పాఫ్ అభియాన్ పేరిట ముందస్తుగా వానకాలం పంటలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంథని వ్యవసాయ శాఖ డివిజన్ ఏడీఏ అంజనీ, కేవీకే రామగిరి ఖిల్లా శాస్త్రవేత్తలు డా, వెంకన్న, డా, కిరణ్, హైదరాబాద్ ఐసీఏఆర్ ప్రధాన శాస్త్రవేత్తలు డా, సురేష్, డా, బాబ్జీ, డా, పాల్ యాదవ్, డా గిరీశ్, సీనియర్ శాస్త్రవేత్త ఎన్, ఎంఆర్ఐ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు ఖరీఫ్ సీజన్‌కు సంసిద్ధంగా ఉండాలన్నారు. అదే విధంగా సహజ వ్యవసాయ సాగు పద్ధతులు , ముందస్తు సాగుఎ విధానం గురించి ప్రత్యేకంగా వివరించారు. అలాగే ఆధీకృత విత్తన షాప్‌ల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తన రషీదులను పంట కాలం పూర్తి అయ్యేంతవరకు రైతులు దగ్గరగా భద్రపర్చుకోవాలని సూచించారు. అధిక దిగుబడులు ఇచ్చే చీడపీడలు తట్టుకునే విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. విత్తన శుద్ధి తప్పని సరిగా చేసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడాకాన్ని తగ్గించుకోవాలన్నారు. పశువుల పేడ, కోళ్ల ఎరువులతో పాటు తదితర సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. నాటు వేయడానికి ముందు పిచ్చి రొట్టె ఎరువు పంటలు వేసి భూమి కలియదున్నాలన్నారు.పురుగు మందులు అవసారానికి మించి వాడకూడదన్నారు. ఎరువుల యాజమాన్యం పంట తొలి దశల నుండి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మరింత వ్యవసాయ సమాచారం కోసం వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, ఏఈవోలు అనూష, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



మొక్కనాటుతున్న డీసీపీ కరుణాకర్

## పొత్కపల్లి ఠాణా తనిఖీ

ఓదెల, మే 30: పొత్కపల్లి ఠాణాను డీసీపీ కరుణాకర్ శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఇక్కడ ఎలాంటి నేరాలు ఎక్కువగా నమోదు అవుతున్నాయో ఎస్ఐ డీ రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాలు, సరిహద్దు ప్రాంత వివరాలు, రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌ల గురించి ఆరా తీశారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరంతరం పెట్రోలింగ్ చేయాలన్నారు. అనంతరం ఠాణా ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, ఏఎస్ఐ వీరస్వామిగౌడ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## సర్కారు స్కూళ్లకు పాఠ్య పుస్తకాల పంపిణీ

జ్యోతినగర్(రామగుండం), మే 30: నూతన విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ముందస్తుగా ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్‌ను రామగుండం ఎంఈవో గడ్డం చంద్రయ్య స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు శుక్రవారం అందజేశారు. జూన్ 12న పాఠశాలల పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే 6 నుంచి బడిబాటకార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ బడులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

ఓదెల, మే 30: ఓదెల మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 2025–26 విద్యా సంవత్సరానికి గాను పాఠ్య పుస్తకాల పంపిణీ శుక్రవారం ప్రారంభించినట్లు ఎంఈఓ రమేశ్ తెలిపారు. అలాగే నోట్ బుక్కులు కూడా అన్ని పాఠశాలలకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు అవసరమైన సామాగ్రిని అందజేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను సర్కార్ బడులకు పంపాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

## గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

రామగిరి, మే 30: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలో 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు వంద మస్టర్లు చేయని, తరచుగా విధులకు గైర్హాజరవుతున్న 282 ఉద్యోగులను అధికారులు గుర్తించారు. ఈమేరకు శుక్రవారం స్థానిక సీఎస్‌సీఓఏ క్లబ్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో 164 మంది గైర్హాజరు కార్మికులు హాజరు కాగా, అందుకు గల కారణాలను ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి కంపెనీ అందించే వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో విధులకు హాజరు కావాలని సూచించారు.

**బదిలీ పై వెళుతున్న అధికారికి సన్మానం**

ఆర్జీ–3 ఏరియా లోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో డీజీఎంగా విధులు నిర్వహిస్తున్న దూప్ సింగ్ మందమర్రి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్‌కు బదిలీపై వెళ్తున్నారు. శుక్రవారం జీఎం ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలోఆర్జీ –3, ఏపీఏ కొలిపాక నాగేశ్వరరావు, అధికారులు హాజరై సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర బాబు, ఫైనాన్స్ ఏజీఎం పీ శ్రీనివాసులు, ఎస్‌వోటూ జీఎంలు ఎం రామ్మోహన్, బీవీ సత్య నారాయణ, అధికారులు రాజారెడ్డి, ఐలయ్య, రాజేశ్వరి, షబ్బీరొద్దీన్, పీడీ సుధాకర్, నాగేశ్వర రావు, సుధాకర్, సునీల్ ప్రసాద్ పాల్గొన్నారు.

## లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

గోదావరిఖని, మే 30: సీఎంపీఎఫ్ పెన్షన్ పొందే సింగరేణి మాజీ ఉద్యోగులు ఏటా నవంబర్‌లో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని సింగరేణి యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. లైఫ్ సర్టిఫికెట్ సమర్పించని వారి పెన్షన్‌ను జనవరి నెల నుంచి నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. పెన్షన్ పంపిణీని బాధ్యతగా 2023 నుంచి ఎస్‌బీఐ ధన్‌బాద్ స్వీకరించిందని పేర్కొన్నారు. ఇటీవల అనేక మంది సింగరేణి మాజీ ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్ అందజేయకపోవడంతో వారి నెలవారి పెన్షన్ ఆగిపోయిందన్నారు. వెంటనే వారు లైఫ్ సర్టిఫికెట్‌ను సమీపంలోని మీసేవా సెంటర్‌లో ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలన్నారు. లేదా ఎస్‌బీఐ బ్యాంకులో బ్యాంకు ఖాతా కాపీని మెయిల్ ద్వారా అందించాలని అడ్రస్ వివరాలను పేర్కొన్నారు.

## పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

రామగిరి, మే 30 : టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి రాజాకుమారి దంపతుల పెళ్లి రోజు సందర్భంగా శుక్రవారం నాగేపల్లి, రత్నపూర్ గ్రామాల్లోని పలువురు నిరుపేదలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను మిర్యాల రాజిరెడ్డి యువసేన సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేశవరావు, వీరగొని సంతోష్, రాజశేఖర్‌రెడ్డి,శ్రీకాంత్‌రావు ,గండి శ్రీనివాస్, చంద్రశేఖర్, రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్లు పంపిణీ

యైటింక్లయిన్ కాలనీ, మే 30: స్థానిక మంజు అబాకస్, వేదిక్ మ్యాథ్స్ అకాడమీ వినూత్న కార్యక్రమం చేపట్టారు. తమ అకాడమీ ఆధ్వర్యంలో అబాకస్ వేసవి శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులకు వీర్లపల్లిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో వృద్ధుల చేతుల మీదుగా సర్టిఫకెట్లను అందజేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు దయానంద్ గాంధీ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఆశ్రమ బాధ్యులు పీటీ స్వామి, సత్యనారాయణ, సత్తయ్య, మానస పాల్గొన్నారు.

## ఈ బైక్ ఎవరిది...?

- అనుమానాస్పదంగా వారం రోజులుగా అక్కడే..



రోడ్డు ప్రక్కన పార్కింగ్ చేసి ఉన్న బైక్

కోల్‌సిటీ, మే 30: గోదావరిఖని సింగరేణి స్టేడియం వద్ద 33వ డివిజన్ పరశురాంనగర్ బోర్డు రోడ్డు ప్రక్కన అనుమానాస్పదంగా పార్కింగ్ చేసి ఉంచిన ఈ ద్విచక్ర వాహనం ఎవరిదో తెలియక స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి రాత్రిపూట అక్కడ పార్కింగ్ చేసి వెళ్లిపోయాడు. ఇప్పటివరకు తిరిగి రాలేదని స్థానికులు వాపోతున్నారు. వారం రోజులుగా వాహనం అక్కడే ఉంటుంది. ఆ వాహనంకు ఏలాంటి నంబర్ ప్లేట్ కూడా లేదు. వెనుకాల మాత్రం పోలీస్ అని రేడియం స్టిక్కర్ ఉంది. ఆ బైక్ ఎవరిదో..? ఎవరు ఇక్కడ పార్కింగ్ చేసి వెళ్లారో..? అసలేం జరిగిందో తెలియక చుట్ట పక్కల వారు గందరగోళానికి గురవుతున్నారు.